ముమ్మరంగా వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-అడ్డతీగల :అడ్డతీగల ఎస్సై వినోద్ ఆధ్వర్యంలో ఆదివారం వేటమామిడి జంక్షన్లో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వాహన పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిలేని వారికి అపరాధరూపం విధించారు. అసలే చలికాలం కావడంతో విపరీతమైన మంచు కురవడంతో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాలని ఎస్ఐ వాహనదారులకు సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో సాయంత్రం 4 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు విపరీతమైన చలి,మంచు తెరలు కమ్ముకోవడంతో ఎదుటి మనిషి కనపడని పరిస్థితులు నెలకొన్నాయి, అయితే కొద్ది మంది యువత అధిక వేగంతో వాహనాలు నడుపుతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని వినోద్ తెలిపారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర -ఎటపాక/అడ్డతీగల: ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలనీ ఎటపాక మండలం టీడీపి నాయకులూ ఎటపాక పోలీస్ స్టేషన్ లో ఆదివారం పిర్యాదు చేశారు. రంప చోడవరం ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న ఎమ్మెల్సీ అనంత బాబు పై చర్యలు తీసుకోవాలన్నానీ, టిడిపి నేతలు స్టేషన్లో పిర్యాదు చేశారు.ప్రస్తుత ఎమ్మెల్సీ రంపచోడవరం నియోజకవర్గం ఎస్టీ ఎమ్మెల్యే అయినటు వంటి మిరియాల శిరీషదేవి పై తరచూ ఆరోపణలు , అసత్య ప్రచారాలు చేస్తున్నాడనీ, ఆయన తీరు వలన ప్రభుత్వప్రతిష్ఠకు కూడా భంగం కలిగిస్తున్నాడనీ, ఎమ్మెల్యే పై మానసిక దాడులు చేస్తున్నారని, కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో ఆమె పరువు, ప్రతిష్ట లకు తీవ్ర విఘాతం కలిగేలా చేస్తున్నారూ. ఆయన చర్య వలన ప్రభుత్వంపై కూడా మచ్చ పడేలేఉందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహారిస్తున్నాడనీ, సామాజిక మధ్యమాల్లో ప్రజలకు కూటమి ప్రభుత్వం పై తప్పుడు అభిప్రాయం కలిగేలా వదంతులు సృష్టిస్తున్నారనీ అన్నారు. ఆయన మాటలు ద్వారా నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా భావోద్వేగాలను రెచ్చగొడుతూ అలజడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అంతేగాకుండా ఆయన కనుసైగ చేస్తే అమెరికాలో ఉండి కూడా మీ అంతు చూడగలను మిమ్మల్ని చంపుతానని భయబ్రాంతులకు గురిచేస్తున్నాడు. ఆయన వ్యాక్యాలు ఎమ్మెల్యే, ప్రజలను భయ బ్రాంతులకు గురి చేసేలా ఉన్నాయని, ఆయన పై చర్యలు తీసుకోవలనీ కోరారు. ఈ కార్యక్రమంలో కొమరం నాగేష్, పర్శిక రాజు, మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వర రావు, సొసైటీ ఛైర్మన్ మాచినేని రాజేష్, నాలజాల మధు, చంద్ర రఘు,తదితరులు పాల్గొన్నారు.

మన్య ప్రాంతాన్ని కమ్మేసిన మంచు

తగ్గుతున్న ఉష్ణోగ్రతలు... పెరుగుతున్న చలి

ఆంధ్రా కశ్మీర్ లంబసింగి ప్రాంతానికి అధిక సంఖ్యలో తరలి వస్తున్న పర్యాటకులు

సింగిల్ డిజిట్ లో కొనసాగుతున్న ఉష్ణోగ్రతలు

విశాలాంధ్ర - చింతపల్లి:అల్లూరి ఏజెన్సీలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో చలి పంజా విసురుతుంది. దాంతో పాటు దట్టంగా కమ్ముకుంటున్న పొగ మంచు, అధిక సంఖ్యలో తరలి వస్తున్న పర్యాటకులతో మన్య ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది.గడిచిన వారం రోజులుగా మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయి. దీంతో మన్య వాసులు చలిని తట్టుకునేందుకు ఉన్ని దుస్తుల కొనుగోలుకు క్యూ కడుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటలైనా సూర్యుడు జాడ లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు చలి మంటలతోనే సరిపెట్టుకుంటున్నారు. మన్య ప్రాంతంలో దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో గిరిజన గూడేలలో పొగ మంచు అధికంగా కురుస్తుంది. ఉదయం 10 గంటల వరకు పొగ మంచు వీడకపోవడంతో వాహనాలు లైట్లు వేసుకొని ప్రయాణం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. పొగ మంచు అందాలను, శీతల వాతావరణాన్ని ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల నుంచి చింతపల్లి మండలంలోని తాజంగి, లంబసింగి పర్యాటక ప్రాంతాలతో పాటు చింతపల్లికి పర్యాటక ప్రియులు అధికంగా తరలి వస్తున్నారు.పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చలి తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, విద్యార్థులు, చిన్నారులు ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు.చింతపల్లి మండల కేంద్రంలో ఉన్ని దుస్తులకు గిరాకి పెరిగింది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు. దీంతో దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు గృహిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కిక్కిరిసిన పర్యాటకం

చాపరాయి జలవిహారిలో సందడి చేస్తున్న పర్యటకులు

విశాలాంధ్ర- దుంబ్రిగుడ :మండలంలోని పర్యాటక కేంద్రాలు ఆదివారం కిక్కిరిసిపోయాయి పర్యాటక కేంద్రం చాపరాయి, అంజోడ సిల్క్ ఫాం పీనరిలో సందర్శకులతో కిటకిటలాడాయి. పర్యాటకుల తాకిడితో చాపరాయి జలవిహారిలో ట్రాఫిక్ ఏర్పడింది. ఎస్సై సురేష్ నేతృత్వాన పోలీసు యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రించారు. జలవిహారిలో సరదా స్నానాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో పర్యాటకులు ఆనందంగా గడిపారు

ఎమ్మెల్సీ అనంతబాబు పై కూటమి నాయకులు ఫిర్యాదు

విశాలాంధ్ర-వై.రామవరం:రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు పై కేసు నమోదు చేయాలని ఆదివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పొత్తూరు కాంతారెడ్డి ఆధ్వర్యం లో కూటమి నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.అమెరికాలో ఉండి కను సైగలు చేస్తే ఎగిరిపోతావంటూ ఎమ్మెల్యే పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.తరచూ సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యే పై అవాస్తవ ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యే ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు.అనంతబాబు పై చర్యలు తీసుకోవాలని ఎస్సై పృథ్వీ కి ఫిర్యాదును అందజేశారు.కార్యక్రమం లో టీడీపీ సీనియర్ నాయకులు రెడ్డి సత్యనారాయణ,కూటమి నాయకులు పల్లాల స్వామిరెడ్డి, చోడి బుల్లి దొర,కురుసం నాగేశ్వరావు,కురుసం సుబ్బన్నదొర, పల్లాల కృష్ణారెడ్డి,జనసేన నాయకుడు బచ్చుల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కోడిపుంజు ఈతకోసం వెళ్లి తండ్రి కొడుకులు మృత్యువాత

విశాలాంధ్ర- కూనవరం: కోడిపందేల సరదా ఓ నిరుపేద కుటుంబంలో పెనివిషాదాన్ని మిగిల్చింది. కట్టుకున్న భర్త కడుపున పుట్టిన కొడుకు విగత జీవులై ఓ తల్లికి తీరని శోకాన్ని మిగిల్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టేకుబాక గ్రామానికి చెందిన సింహాద్రి పాపారావు 45 అతని కొడుకు జస్వంత్ 15 ఆదివారం ఉదయం కోడిపుంజుకి ఈత కొట్టించడం కోసం నర్సింగపేట గ్రామం లోని సుమారు 20 అడుగుల లోతు ఉన్న ఒక నీటి కుంట వద్దకు తీసుకువెళ్లారు. ఈత కొట్టిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు తండ్రి కొడుకులు నీటిలో పడిపోయి ఉండవచ్చని తెలిపారు. మృతునికి భార్య,12 సంవత్సరాల కూతురు ఉన్నారు. పాపారావు మృతితో గ్రామమంతా విషాదం అలుముకుంది. కాగా పాపారావు భార్య అనురాధ ఆక్రందనలు మిన్నంటాయి. కూనవరం ఎస్సై బి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర - రంపచోడవరం : అల్లూరి జిల్లా రంపచోడవరంమండలం జాగరంపల్లి గ్రామం వద్ద ఆర్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఈ రోజు హిదూ సమ్మేళనం కార్యక్రమం ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పిఠాపురం దత్త స్వామీజీ విశ్వానంద భారతి ముఖ్య అతిథిగా హాజరై భక్తులు కు హిందూవుల ప్రాముఖ్యత ను, భారత సంప్రదాయం విశిష్ట త ను తెలిపారు. శక్తి సంస్థ ప్రతినిధి శివ రామ కృష్ణ మాట్లాడుతూ గిరిజన సంప్రదాయం గొప్పతనం గురించి వివరించారు. ఆర్ ఎస్ ఎస్ ప్రతినిధులు చక్రధర్ , ఈ కార్యక్రమం లో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి , మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరావు, శ్రీను, రామా రెడ్డి పెద్ద సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.

ఎదా విధి గా ఆక్రమణలు

విశాలాంధ్ర -రంపచోడవరం : అల్లూరి జిల్లా రంపచోడవరం ప్రధాన కేంద్రం లో గత ఆరు నెలలు క్రితం రోడ్డు కి ఇరువైపులా ఉన్న ఆక్రమణ లు తొలగించారు. మళ్ళీ కొందరు అక్రమంగా పాకలు , రేకులు షెడ్డు లు నిర్మాణం చేస్తుండటం తో పంచాయతీ అధికారులు పలు చోట్ల ఫ్లెక్సీ లు ఏర్పాటు చేసి ఎటువంటి నిర్మాణాలు చేసినా చట్ట పరమైన చర్యలు చెప్పడతామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

వాహనాలు తనిఖీ నిర్వహింపు

విశాలాంధ్ర -రంపచోడవరం : రంపచోడవరం మండలం పోలవరం సెంటర్ దగ్గర రంపచోడవరం ఎస్ ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈరోజు ఆదివారం అవడం వల్ల పర్యాటకులు ఎక్కువగా రావడంతో క్షుణ్ణంగా వాహన తనిఖీ లు చెప్పట్టి . ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారిపై చలానా విధించారు.

మండల ఐటీడీపి కన్వీనర్ గా సవలంరాజు

విశాలాంధ్ర- వి. ఆర్. పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి చెందిన సవలం రాజు అనే వ్యక్తి టిడిపి అభిమానిగా కొనసాగుతున్న ఆయనను గుర్తించి ఐ టీడీపీ మండల కన్వీనర్ గా మండల టిడిపి పార్టీ ఎన్నుకోవడం ఆనందదాయకమని పలువురు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

ఏదేచ్ఛ గా రాష్ డ్రైవింగ్

విశాలాంధ్ర -రంపచోడవరం : స్థానిక జూనియర్ కాలేజీ రోడ్ లో సాయంత్రంనాలుగు గంటల కు కాలేజీ వదిలే సమయంలో అధిక వేగం తో వాహనాలు నడుపుతూ ముఖ్యం గా యువత త్రిబుల్ రైడింగ్ , ఓవర్ స్పీడ్ తో వాహనాలు నడుపుతూ తోటి వాహనందారులను ప్రజలు ను బయ బ్రాంతుల కు గురి చేస్తున్నారు. గతం లో రాత్రి 10 గంటల తర్వాత పోలీస్ లు గస్తీ తిరుగుతూ ఆకాతాయులు , మందు బాబులు బయట తిరగకుండా చర్యలు చేపట్టి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టే వారు. ఇటీవల కాలం లో ఇది ఎక్కడ మచ్చు కైనా కాన రావడం లేదు.... ఇటీవల కాలం లో బైక్ దొంగతనాలు అధికంగా జరగడానికి ఇదే ప్రధాన కారణం. ఇప్పటికైనా పోలీస్ వారు తగిన చర్యలు చేపడతారని రంపచోడవరం ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం వనభోజన కార్యక్రమం

ఐకమత్యానికి చిహ్నం వనభోజనం

విశాలాంధ్ర -పాడేరు:బంధుమిత్రులతో కలిసి చెట్ల నీడలో (ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద) ప్రకృతితో మమేకమై భోజనం చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఆనందంగా గడపడం. ఇది కార్తీక మాసంలో ఎక్కువ ప్రాచుర్యం పొందింది, ఐకమత్యాన్ని పెంచే వేడుక, దీనిలో భాగంగా పూజలు, వంటలు చేసి, భోజనం చేసి, ఆటలు ఆడుకుంటారని ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు పారిజాతం(గిరి) అధ్యక్షులు మహేష్ కార్యదర్శి కృష్ణ అన్నారు.ఆదివారం ఆ సంఘ సభ్యులు అందరితో కలిసి అల్లూరి జిల్లా ఎస్పీ కార్యాలయం వెనకాల పొలాల మధ్యలో నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి విలేకరులు హాజరయ్యారు. వివిధ మండలాల నుండి హాజరైన విలేకరులకు దుస్సాల్వతో సన్మానం చేసి మెమొంటెన్స్ అందించారు. ఈ సందర్భంగా ఏపీ టీఆర్ఏ గౌరవ అధ్యక్షులు సిహెచ్ విరమణ, దుంబ్రిగూడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శెట్టి సంజీవ్ లు మాట్లాడుతూ సంఘాలు ఎన్ని అయినా ఉండొచ్చు విలేఖరి వృత్తిలో ఉన్న మనమందరం ఒకటేనని కొనియాడారు. విలేఖరి మిత్రులందరికీ ఒక వేదిక చేసినందుకు మీకు అందరికీ ప్రత్యేకమైన కృతజ్ఞతాలోని ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరుపుకోవాలని అన్నారు. అలాగే ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు పారిజాతం అధ్యక్షులు మహేష్ కార్యదర్శి కృష్ణ కోశాధికారి రాము లు మాట్లాడుతూ విలేఖరి వృత్తిలో ఉన్న మనమందరం ఒక్కరోజు ఆనందంగా గడపడం కోసమే ఈ వనభోజన కార్యక్రమం అనేది నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమానికి మీరందరూ వచ్చినందుకు మీకందరికీ ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు అని, ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం మరింతగా అభివృద్ధి చెందడం కోసం మీరంతా మాకు సహాయ సహకారాలు అందించాలని ఈ సంఘం బలోపేతానికి మేము కృషి చేస్తున్నామని ఈ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని మనమందరం వేరే వేరే సంఘాల్లో ఉన్నప్పటికీ మన వృత్తిలో భాగంగా మనమందరం ఒకటేనని మనమందరం కలిసికట్టుగా ఉంటేనే మనకున్న హక్కులు చట్టాలు మనం కాపాడుకోగలుగుతామని వారన్నారు. విలేఖరి అనేవారికి రక్షణ లేకుండా పోయిందని దానికోసం మనమందరం ఐకమత్యంగా ఉండాలని వారన్నారు. ఈ సందర్భంగా ఆర్టిఐ అధ్యక్షులు వంతల నాగేశ్వరరావు, తెదేపా పాడేరు మండల ప్రధాన కార్యదర్శి దన్నేటి పలాసి సురేష్ కుమార్ లు మాట్లాడుతూ నేటి సమాజంలో విలేఖరి అనేవాడు చాలా ముఖ్యమని ఆదివాసి ప్రాంతంలో అనేక సమస్యలతో సతమాతమవుతున్నాయని మన హక్కులు చట్టాలు కాపాడడం కోసం మీ వంతు కృషి చేయాలని ఆయన అన్నారు. ఎన్నో సమస్యలు విలేకరులు రాసిన వార్తలు వల్లనే పరిష్కారం అవుతున్నాయని మీ సేవలు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. అనంతరం ఆటపాటలతో ఎంతో ఉత్సాహంతో వనభోజన కార్యక్రమం ముగిసింది.ఈ కార్యక్రమంలో ఏపీ టీఆర్ఏ కార్యదర్శి మత్స్యరాజు, కోశాధికారి, సునీల్ కుమార్, ఆనంద్, జై భీమ్ సంఘం అధ్యక్షులు భాస్కర్, అల్లూరి విలేకర్ల సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు డేవిడ్ రాజ్, శ్రీధర్, ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవ సంఘం సంఘ సభ్యులు నిన్న నాయక్ (పండు) శంకర్, కోటి, శ్రావణ్, శ్రీరామ్, కేశవ, బాలు, లక్ష్మీ శ్వరరావు, వివిధ మండలాల నుండి వచ్చిన విలేకరులుతదితరులు పాల్గొన్నారు.

ఉదారత భావాన్ని చాటుకున్న బికే నాయుడు

విశాలాంధ్ర- దుంబ్రిగుడ : అరకు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొమ్ములు నాయుడు ఉదారత భావాన్ని చాటుకున్నారు. మండలంలోని గుంట గన్నెల పంచాయితీ లక్క గ్రామానికి చెందిన కిల్లో భగవాన్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో పెద్దకర్మకు ఇబ్బందులు ఎదురయ్యాయి. చలించిన ఆయన బాధిత గిరిజనుడి స్వగ్రామానికి చేరుకొని పెద్దకర్మకు 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు, నగదును అందజేశారు. ఆయన ఉదారత భావంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ సర్పంచ్ విశ్వనాథం, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు అర్జున్, పెస కమిటీ సభ్యులు గాని, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మానానికి రాజకీయ రంగు

విశాలాంధ్ర -కొయ్యూరు : కొయ్యూరు మండలం, చిడిపాలెం పంచాయతీ, కాకరపాడు గ్రామంలో గతం లో వున్న వినాయకుని ఆలయంని జాతీయ రహదారి పనులకు ఆటంకంగా వున్న కారణం గా అధికారులు ఆలయాన్ని తొలగించారు. ఈ ఆలయం పునర్నిర్మాణం లో భాగంగా స్థల వివాదం కొన్ని రోజులుగా తెదేపా వర్గం అలాగే వైసీపీ వర్గాల మధ్య రాజకీయ రంగు పులుముకుంది. వివరాలలోకి వెళితే.... గతం లో వున్న స్థలానికి అనుకోని వున్న ప్రభుత్వ స్థలం లో ఆలయ నిర్మాణం జరగాలని తెదేపా వర్గీయలు, అలాకాదు జనావశాలలో ఆలయనిర్మాణం వద్దు వేరే చోట నిర్మించాలని వైసీపీ వర్గీయలు మధ్య కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతుంది.ఈ తరుణంలో తెదేపా వర్గీయలు ప్రభుత్వ స్థలం లో నే ఆలయ నిర్మాణం జరగాలని పట్టు బట్టి జిల్లా కలెక్టర్ ద్వారా ఆలయ నిర్మాణానికి 2 సెంట్ల స్థలానికి అనుమతి తెచ్చుకొవడం, ఆ అనుమతులను వైసీపీ వర్గీయులు, రద్దు చేయించడంతో ఆలయ నిర్మాణం కాస్తా రాజకీయ రణానికి వేదిక అయ్యింది.ఎట్టకేలకు అధికార బలం తో తెదేపా ఇంచార్జి గిడ్డి ఈశ్వరి సమక్షంలో ఆలయ నిర్మాణం చేపడితే తమకు అడ్డుగా ఎవరూ నిలువలేరని భావించిన తెదేపా వర్గీయలు శనివారం నాడు నియోజకవర్గ ఇంచార్జీ ని ఆహ్వానించి ఆమె సమక్షంలో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ క్రమంలో వైసీపీ వర్గీయులకు, గిడ్డి ఈశ్వరి కి కొంత వాగ్వాదం జరిగినా... సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎలాంటి అల్లర్లకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం తో చెదురు మొదురు వివాదం జరిగినా ఆలయనిర్మాణ పనులు పాక్షికం గా పూర్తి అయ్యాయి. ఈ ఘటన పై పలువురు విమర్శిస్తూ అలాగే ఇంకొందరు హర్షిస్తున్నారు.

ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట అగ్నికి ఆహుతి

లబోదిబోమన్న రైతులు

50 వేలకు పైచిలుకు ఆర్థిక నష్టం

వరి కుప్పలను పరిశీలించిన ఎర్రబొమ్మల సర్పంచ్ పండయ్య

విశాలాంధ్ర - చింతపల్లి :ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట అగ్నికి ఆహుతి కావడంతో ఆ వరి కుప్పలు గల రైతు కుటుంబం లబోదిబో మంది. మండలంలోని ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్నావల్లి గ్రామానికి చెందిన పాడి వెంకట సత్యనారాయణ, సీతమ్మ దంపతులకు చెందిన రెండు వరికుప్పలు గుర్తు తెలియని ఆకతాయిలు చేసిన పనికి ఆహుతయ్యాయి. చేతికొచ్చిన వరి వంటను కోత కోసి గ్రామానికి దూరంగా పంట పొలంలోనే కుప్పలుగా వేసుకున్న ఆ రైతు సంక్రాంతి దాటిన తరువాత నూర్పిడి చేసుకోవచ్చు అని తలచాడు. కానీ విధి వక్రించి చేతికి అందిన వరి పంట నోటికి అందకుండా దగ్ధమై పోయింది. దీంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరయింది. ఈ విషయం తెలుసుకున్న ఆ పంచాయతీ సర్పంచ్ లోత పండయ్య ఎర్నా పల్లిలో వరి కుప్పలు దగ్ధమైన ప్రదేశాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. పంటను కోల్పోయిన రైతు కుటుంబాన్ని ఓదార్చారు. ఈ విషయంలో ప్రభుత్వానికి నివేదించి తగిన సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయదారులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను గుర్తుతెలియని ఆకతాయిలు ఈ విధంగా నిప్పు పెట్టి నాశనం చేయడం బాధాకరమన్నారు. పదిమందికి అన్నం పెట్టే రైతన్నకు ఇటువంటి సంఘటనలు బాధ కలిగిస్తాయన్నారు. సుమారు 30 బస్తాలకు పైగా దిగుబడి నిచ్చే ఈ పంట బూడిద కావడంతో ఆ రైతు కుటుంబం సుమారు 50 వేల రూపాయలకు పైగా నష్టానికి గురి అయిందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతును ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

గ్రామం నడిబొడ్డున చేపలు, మాంసం దుకాణాలు పెట్టొద్దు

పచ్చి చేపలు, మాంసం దుకాణాల ఏర్పాటుకు శాశ్వత మార్కెట్ సదుపాయం కల్పించడంలో అధికారులు విఫలం

వారపు సంత నాటికైనా శాశ్వత మార్కెట్ సదుపాయం సమకూరేనా అంటున్న స్థానికులు

విశాలాంధ్ర - చింతపల్లి :పచ్చి చేపల దుకాణాల ఏర్పాటుకు శాశ్వత మార్కెట్ సదుపాయం కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారు. గత బుధవారం స్థానిక ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పచ్చి చేపలు, మాంసం దుకాణదారులకు శాశ్వత మార్కెట్ సదుపాయం కల్పిస్తామని, అందరూ ఒకే చోట వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించినప్పటికీ ఆదివారం వరకు అధికారులు ఏ ఒక్క వ్యాపారికి నోటీసులు జారీ చేయడం గాని, మార్కెట్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించడం గానీ చేయకపోవడంతో చేపలు, మాంసం దుకాణదారులు యదాప్రకారమే ఆదివారం గ్రామం నడిబొడ్డున వివిధ ప్రదేశాలలో చేపలు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. దీంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోవు వారపు సంత (బుధవారం) నాటికైనా పచ్చి చేపలు, మాంసం దుకాణాల ఏర్పాటుకు ప్రత్యేక స్థలం కేటాయించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత అందరిది

విశాలాంధ్ర-మారేడుమిల్లి:రాజమండ్రికి చెందిన మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా"వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేయడం మన బాధ్యత" అనే నినాదంతోఛలో మారేడుమిల్లి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగామారేడుమిల్లి ఎస్ ఐ కె.శ్రీనివాస్ మరియు పోలీస్ సిబ్బందితో పర్యావరణ అవగాహన నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఫౌండేషన్ బృందం మారేడుమిల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రధాన టూరిస్టు కేంద్రాలకు వెళ్లిర్యాలీలు,సమావేశాలు నిర్వహిస్తూ పర్యాటకులకుపర్యావరణపరిరక్షణపై అవగాహనకల్పించారు . ఈ సందర్భంగా మన బాధ్యత ఫౌండేషన్ జోనల్ ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కాశీ నరేంద్ర మాట్లాడుతూపర్యావరణ కాలుష్యం రోజురోజుకీపెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడికక్కడ పడేయకుండాపర్యాటకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అటవీ సంపదను భద్రంగా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.అదే విధంగా మన బాధ్యత ఫౌండేషన్ రాజమండ్రి సిటీ అధ్యక్షురాలు గారా శ్రీవిద్య రాణి మాట్లాడుతూగత కొన్ని సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామని తెలిపారు.ప్రాంతం ఏదైనా సరే వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోఫౌండేషన్ సభ్యులు సింధు, జ్యోత్స్న, ప్రసాద్,ట్రైబల్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ కుంజ అర్జున్,మారేడుమిల్లి పోలీసులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఆర్ పి ఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీగా పులిచర్ల ప్రేమ్ స్వరూప్ నియామకం

విశాలాంధ్ర-మారేడుమిల్లి:మారేడుమిల్లి మండలం చట్లవాడ గ్రామానికి చెందిన పులిచర్ల ప్రేమ్ స్వరూప్‌ను నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి) తరపున అల్లూరి సీతారామరాజు జిల్లా, జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ బాధ్యతలు అప్పగించినట్లు సంస్థ వర్గా లు తెలిపాయి.ప్రస్తుతం రంపచోడవరం కేంద్రంగా నేత్ర విజన్ ఐ కేర్ సెంటర్ ని నిర్వహిస్తున్న ప్రేమ్ స్వరూప్, గిరిజన మరియు గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహిస్తూ ప్రజాసేవలో చురుకుగా పాల్గొంటున్నారు.గతంలో ఎన్ హెచ్ ఆర్ పి ఎఫ్ మీడియా లో చురుకైన పాత్ర పోషించిన ఆయన, ఎన్ హెచ్ ఆర్ పి ఎఫ్ జిల్లా కన్వీనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రేమ్ స్వరూప్ మాట్లాడుతూ, మానవ హక్కులు, సివిల్ రైట్స్, రాజకీయ హక్కుల పరిరక్షణ కోసం తన పరిధిలో నిబద్ధతతో కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఎన్ హెచ్ ఆర్ పి ఎఫ్ ఛైర్మన్/సీఈఓ శ్రీ టి.ఎస్. రామచంద్రనాయుడు, వైస్ ఛైర్మన్ బి.ఎస్. కృష్ణా రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక బోర్డు డైరెక్టర్ మాధవి లత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ భరత్, జోనల్ అధ్యక్షులు వలి ఖాన్,అల్లూరి జిల్లా అధ్యక్షులు ఏ. రాంప్రసాద్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మానవ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలపై చట్టపరమైన అవగాహన కల్పించడం, బాధితులకు న్యాయం చేకూర్చే దిశగా నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

శక్తి టీంలు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం ఎఎస్పీ, శక్తి టీమ్స్ నోడల్ ఆఫీసర్ మనీషా వంగలరెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్ 1&2 పోలీస్ అధికారులు, సిబ్బంది ఆదివారం పార్వతీపురం పట్టణం బెలగాంలోని బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు సమాజపు పాత్ర మరియు బాధ్యత విద్యార్థినులకు సామాజిక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరస్పర గౌరవం మరియు లింగ సమానత్వం ప్రాముఖ్యతను వివరించారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్రను తెలియజేశారు. క్రమశిక్షణ, మంచి ప్రవర్తన ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని విద్యార్థినులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ ఇంచార్జి, ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుళ్లు రామలక్ష్మి, నిర్మల శక్తి టీమ్ 1&2 పాల్గొన్నారు.

మెలకువలు నేర్చుకుంటే మేథ్స్ సులభం

-అబాకస్‌తో విద్యార్థులలో చైతన్యం, మానసిక అభివృద్ధి మెరుగుపడుతుంది
- రిటైర్డ్ ఐపిఎస్ రవిప్రకాష్

విశాలాంధ్ర-సాలూరు : విద్యార్థులలో అబాకస్ ద్వారా గణిత మేధస్సు మాత్రమే కాకుండా చైతన్యం, మానసిక అభివృద్ధి మెరుగుపడుతుందని రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఉప్పాడ రవిప్రకాష్ అన్నారు.ఆదివారం స్థానిక ఆర్యవైశ్య ధర్మశాలలో యుసిఎమ్ఎఎస్ 8వ వార్షికోత్సవం సంస్థ డైరెక్టర్ మల్లూరి స్వప్నమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన రవిప్రకాష్ విద్యార్థులను, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా ప్రముఖ వైద్యులు ద్రాక్షాయని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రవిప్రకాష్ చిన్నారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండి పిల్లలకు గణితం పట్ల భయాన్ని పోగొట్టాలన్నారు. పజిల్స్, అబాకస్, బోర్డులు, పూసల చట్రం వంటి బోధన విధానంతో గణితం పట్ల భయాన్ని పోగొట్టి ఆసక్తి కలిగేలా చేయాలన్నారు. లెక్కలంటే కష్టం కాదని ఇష్టంతో చదివితే పరిపూర్ణ జ్ఞానం లభిస్తుందని, గణితంలో రాణించిన వారు ఇతర సబ్జెక్టులలోనూ సులభంగా రాణించగలరన్నారు. మెలకువలు నేర్చుకుంటే మేథ్స్ కష్టమేమీకాదన్నారు.తాను కూడా గణితంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివానన్నారు. పోటీ పరీక్షలలో విజయం సాధించేందుకు గణితశాస్త్రం దోహద పడుతుందన్నారు. యుసిమాస్ అనేది అంతర్జాతీయంగా పేరుగాంచిన గణితవిధానమని ఇటువంటి విధానం సాలూరులో విద్యార్థులకు నిర్వహకులు నేర్పటం ఆనందదాయకమన్నారు. అలాగే ప్రతీ ఒక్కరకి స్వీయ రక్షణ అవసరమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ జరజాపు ఈశ్వరరావు, డాక్టర్ ద్రాక్షాయణి, ప్రముఖ న్యాయవాది కిలపర్తి రామ్మూర్తిలు మాట్లాడుతూ విద్యార్థుల యుసిమాస్ వలన విద్యార్థులలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందన్నారు. సృజనాత్మక, విశ్లేషణాత్మక ఆలోచనను మెరుగుపరుస్తుందన్నారు. అబాకస్ విధానం మొదట మలేషియాలో ప్రారంభమైందని నేడు అనేక దేశాలకు విస్తరించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మల్లూరి మోహన్‌కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు మీసాల నవీన్‌కుమార్, భాష, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఆదివాసి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహణ

విశాలాంధ్ర-బెలగాం : ఆల్ ఇండియా ఆదివాసి రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ పార్వతీపురం గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం ఆదివాసులకి కల్పించిన హక్కులను రాజకీయ నాయకులు కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మనకి రాజ్యాంగంలోకి కల్పించిన హక్కులను మనం కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధపడాలని తెలియజేశారు. అలాగే వన్ 1/70 యాక్ట్ గాని పిసా చట్టం గాని అటవీ హక్కుల చట్టం గాని ఇటు అధికారులు అటు రాజకీయ నాయకులు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని గిరిజన హక్కులను కాల రాస్తున్నారని కిల్లాన నాగేశ్వరావు ఆవేదన వ్యక్తం పరిచారు. అలాగే ఆల్ ఇండియా ఆదివాసి రాజ్యాంగ హక్కుల సామాన్య కమిటీ పార్వతీపురం మన్యం జిల్లాలో నూతనంగా కమిటీని ఏర్పాటు చేశారు. మన్యం జిల్లా ఛైర్మన్ గా కె. సుబ్బారావు, వైస్ ఛైర్మన్ లుగా ఎం. ముత్యాలు బిడ్డిక తమ్మయ్య, ఎం. రమణ, బి. శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా సిహెచ్ సీతారాం, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, పల్ల సురేష్, సభ్యులుగా బి. రాజు, డి. లక్షణదొర, బి. జీవన్, మహిళా విభాగ జిల్లా అధ్యక్షులుగా కోలక గౌరమ్మలను ఎంపిక చేశారు.

ఈ-చలానాలు వసూళ్లలో పోలీస్ శాఖ నూతన విధానంపై ప్రజల్లో పెదవి విరుపు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంపై పడనున్న ప్రభావం

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో గత వారంరోజుల నుండి పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ-చలానాల వసూళ్లపై ప్రత్యేకదృష్టి సారించడంపట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. గతంలో వివిధ సందర్భాల్లో వాహనాలపై వేసిన అపరాధ రుసుము వసూలు కోసం పోలీస్ శాఖ గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బంది నుంచి పోలీస్ స్టేషన్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్లకు లక్ష్యాలను నిర్దేశించి వసూళ్ల చేయాలని ఆదేశాలు జారీ కావడంతో ప్రతిఒక్కరి చేతిలో బకాయిలకు సంబంధించి ప్రింటెడ్ పేపర్ పట్టుకొని ఫోన్లు చేయడంలో వారంతా నిమగ్నమై ఉన్నారు. మరిఇంతలాగా ఫోన్లుచేసి మీఅపరాధ రుసుము వెంటనే చెల్లించాలని, చెల్లించకపోతే కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. చాలామంది వాహనదారులు దీనిపై ఆవేదనకూడా వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది వాహనదారులు తమ వాహనాలు ఇతరులకు అమ్మామని తమకు సంబంధం లేదని చెప్పడంతో పాటు, మరికొంతమంది తమవాహనాలు చాలారోజులక్రితమే స్క్రాప్ కు ఇచ్చారని చెప్పి తమకు సంబంధం లేదని చెప్పడం కూడా జరుగుతుంది. ఏదేమైనా ఈ-చలానాలు వసూళ్లలో నూతన విధానం రానున్న రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై ఉమ్మడి కూటమి ప్రభుత్వంపై దీని ప్రభావం కూడా పడే అవకాశం ఉందని నాయకులు కూడా ఎల్లచోట్ల చర్చించుకుంటున్నారు. రోడ్లు గోతులతో ఉండి ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని ప్రభుత్వం, వాహనదారులపై వివిధ సందర్భాల్లో విధించిన ఈ-చలానాలు వసూళ్లవిధానంపై పెదవి విరుస్తున్నారు. పోలీస్ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది కూడా ఈ-చలానాలు తక్షణమే కట్టాలని ఫోన్లతో అడగడంలో కూడా ఒకింత ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది. ఏదేమైనా అపరాధరుసుమును వేసిన పోలీస్ శాఖ, ఆర్ టి ఓలు వాటిని అప్పుడే వసూలుచేసి ఉంటే బాగుండేదేమో గాని ఇటువంటి విధానం ద్వారా ఫోన్లుచేసి వెంటనే చెల్లించాలని పోలీస్ సిబ్బంది తెలియజేయడంపట్ల వాహనదారులు విస్తృతముగా ప్రభుత్వంపై విమర్శించడం సర్వత్ర వినిపిస్తుంది. ఇప్పటికైనా దీనిపై జిల్లాపోలీసు ఉన్నతాధికారులు పునః పరిశీలన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కూటమి ప్రభుత్వ నాయకులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన ప్రైవేటీకరణ ప్రయత్నాలు మానుకోవాలి

మధ్యాహ్న భోజన నిర్వహకుల సంఘం, సిఐటియులు డిమాండ్

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఇస్కాన్ సంస్థకు అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందని అందులో భాగంగానే స్మార్ట్ కిచెన్ల పేరుతో కొన్ని కేంద్రాలను గుర్తించి నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని ఈ ప్రయత్నాలను మధ్యాహ్న భోజన నిర్వహకుల సంఘం, సిఐటియు ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించవని సిఐటియు జిల్లా కార్యదర్శి బి వి రమణ హెచ్చరించారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో అధ్యక్షులు బిడ్డిక సుశీల అధ్యక్షతన మధ్యాహ్న భోజన నిర్వహకుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో సీఎం చంద్రబాబునాయుడు ఇలానే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీ కరించేందుకు ప్రయత్నాలు చేశారని అప్పుడు సిఐటియు రాష్ట్రవ్యాప్త ఆందోళన నిర్వహించి ఆ ప్రయత్నాన్ని తిట్టుకొట్టిందని మరలా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అలాంటి ప్రయత్నాలనే చేస్తున్నదని విమర్శించారు. కొంతమంది ప్రభుత్వ పెద్దలకు కమిషన్లను అందజేసేందుకు చేస్తున్న ప్రయత్నమే తప్ప ఈ నూతన స్మార్ట్ కిచెన్ల విధానం ఎట్టి పరిస్థితుల్లోను గిరిజన ప్రాంతానికి ఉపయోగపడదని అన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ఈ మార్పు వలన గిరిజన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందక పాఠశాలలలో డ్రాప్ అవుట్స్ పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నూతన విధానం వలన మధ్యాహ్నాం భోజన నిర్వాహకులకే కాకుండా విద్యార్థులకు, దళిత గిరిజన ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఈ ప్రయత్నాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల మధ్యాహ్న భోజన నిర్వహకులు, పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులతో సిఐటియు ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలతి, మంగమ్మ,శకుంతల, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండంగి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్భరం.... వారి జీవనం

- స్మశానవాటికకు నోచుకోని వైనం... పాడైన ఇళ్లల్లోనే జీవనం
- మూడున్నర దశాబ్దాలు పూర్తయిన
- ఇప్పటికీ కొత్త ఇల్లు మంజూరు చేయని ప్రభుత్వం
- ఇది చింతలవెలగాం దళితుల దుర్భర జీవితం

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : ప్రభుత్వాలు మారుతున్న వారి జీవన స్థితిగతులు మారడం లేదు అన్నిచోట్ల అభివృద్ధి కనిపిస్తున్న వారి పరిస్థితి మాత్రం దయనీయమే ప్రభుత్వం ఇచ్చిన భూములు వారికి అందని ద్రాక్ష... దశాబ్దాలు పూర్తయిన శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోనే వారి జీవనం. కుటుంబ సభ్యులు బంధువులకు ఎవరైనా మరణిస్తే ఖననం చేసుకునేందుకు కానరాని స్మశాన వాటిక. ఇది మండలంలోని చింతల బెలగాం గ్రామ దళితుల దుర్భరణీయ జీవనం అయితే ఈ గ్రామంలో మొత్తం 40 కుటుంబాలు జీవిస్తున్నాయి వీరికి ఆ గ్రామంలో అన్ని సమస్యలే... ఈ కుటుంబాలకు 1990-91 ఆర్థిక సంవత్సరంలో ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద ఎనిమిది వేల రూపాయలతో ఇల్లు మంజూరు అయ్యాయి. అప్పుడు నిర్మించుకున్న ఇల్లు ఇప్పుడు మూడున్నర దశాబ్దాలు పూర్తయ్యాయి శిథిలావస్థలో కూడా ఉన్నాయి ఎప్పుడు కూలి పోతాయో అనే విధంగా పెచ్చులూడిపోతున్న స్లాబ్ ఇళ్లలోనే జీవిస్తున్నారు ఇప్పుడు కొత్తగా ఇల్లు మంజూరు అవుతాయని దరఖాస్తు చేసుకుంటే గతంలో మీకు ఇల్లు మంజూరు అయ్యాయని ఇప్పుడు కుదరదని అధికారులు తేల్చి చెబుతున్నారని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వీళ్లనివాసం ఉంటున్న ఇల్లు చూస్తే బయటపటారం లోన లొటారం అనే సామెత గుర్తొస్తూ ఉంది. బయటకు చూస్తే ఆ ఇల్లు అందంగా కనిపించాలని శిథిలావస్థలో ఉన్న ఆ ఇళ్లకు రంగులు వేసుకొని ఆ ఇళ్లలోనే జీవనాన్ని సాగిస్తున్నారు కానీ లోపల పెద్దపెద్ద పిచ్చులూడిపోతున్న స్లాబులు బీటలు వారిని గోడలు ఎప్పుడు కూలిపోతాయో అనే విధంగా ఉన్నాయని భయాందోళనలో ఉన్నారు. వీరికి ఇచ్చిన డి పట్టా భూములు కూడా రెవెన్యూ అధికారులు పుణ్యమా అని రికార్డుల ట్యాంపరింగ్ ద్వారా అగ్రకులాల వారి వసమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరిపై ఇంత దారుణం జరిగిన జిల్లా కలెక్టర్ కు ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసిన తమకు న్యాయం జరగలేదని వీ రు ఆక్రోసం వ్యక్తం చేస్తున్నారు ఇకపోతే గతంలో సర్వే నెంబరు 46 లో 5 ఎకరాల స్థలం ఉండేది ఇందులో 46/1లో 2.90 ఎకరాల చెరువు ఉంటే ఇప్పుడు అది కేవలం 60 సెంట్లు మాత్రమే మిగిలిపోయింది. మిగిలిన 2..10 ఎకరాల భూమిలో దళితులకు స్మశాన స్థలం ఉండేది కానీ మొత్తం కబ్జాకు గురై కేవలం సెంటున్నర స్థలము మాత్రమే మిగిల్చారు ఈ స్థలంలోనే దళితులు ఎవరు చనిపోయిన ఖననం చేయాల్సిన దుస్థితి నెలకొంది.ఇంత దయనీయ స్థితిలో జీవనం సాగిస్తూ తమ గోడును ప్రభుత్వానికి జిల్లా అధికారుల ద్వారా వేడుకున్న వీరికి న్యాయం చేసే నాధుడే కరువయ్యారని మీరు కన్నీటి పర్యంత మవుతున్నారు. ఇకనైనా తమకు తగు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

దయనీయ స్థితిలో ఉన్నాం. ఈ గ్రామంలో మేమంతా దయనీయ స్థితిలో ఉన్నాం ఉన్న ఇల్లు శిథిలావస్థలో ఉన్నాయి చనిపోయిన మా వారిని ఖననం చేసే స్థలం లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన డి పట్టా భూములు రెవెన్యూ అధికారుల పుణ్యమా అని అగ్రకులాల చేతిలో పడ్డాయి.

-రెడ్డి మహేష్, దళితుడు, చింతల బెలగాం గ్రామం, జియ్యమ్మవలస

మాకు న్యాయం చేయండిలి మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఇల్లు శిథిలమైపోయి ఇల్లు మంజూరు చేయడం లేదు దయనీయ స్థితిలో జీవిస్తున్నాం ప్రభుత్వమే ఆదుకోవాలి.

--బెలగాపు చిన్నయ్య, దళితుడు, చింతలబలగాం గ్రామం, జియ్యమ్మవలస మండలం

కౌశల్ 2025లో సుజ్విన్‌కు రాష్ట్ర స్థాయి బహుమతి

విశాలాంధ్ర-కురుపాం : భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో సైన్స్&టెక్నాలజీపై తిరుపతి లో నిర్వహించిన కౌశల్-2025 పోటీలలో కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పంటల రోహిత్, వద్ది సుజ్విన్ లు పాల్గొన్నారు. సైన్స్ & టెక్నాలజీ ఇన్ ఆంధ్రప్రదేశ్ అంశంపై వద్ది సుజ్విన్ రూపొందించిన రీల్ రాష్ట్ర స్థాయి బహుమతికి ఎంపిక అయ్యింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పిఆర్‌టియు మండల ఆత్మీయ సమ్మేళనం, కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలంలో ఆదివారం పిఆర్‌టియు కార్యవర్గ ఎన్నిక నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మన్యం జిల్లా డిప్యూటీ ఈవో పత్రి కృష్ణమూర్తి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా నాయకులు అమనాన సూర్యనారాయణ, కాగాన విజయకుమార్, వాలెటి తవిటి నాయుడు పాల్గొన్నారు. నూతన కార్యర్గం అధ్యక్షులు బంకురు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.విజయభాస్కర్, అసోసియేటివ్ అధ్యక్షులు ఏ.శ్రీహరినాయుడు, జిల్లా అసోసియేటివ్ అధ్యక్షులు కెటిటివి ప్లోనాయుడు, జిల్లా కౌన్సిలర్స్, గర్భన శ్రీనివాస రావు, ముంజెటి ఈశ్వరరావు, పత్రి అనిల్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గురువులకు పూర్వ విద్యార్థుల ఆహ్వానం

విశాలాంధ్ర-కురుపాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో 10వ తరగతి వరకు చదివి వివిధ దేశాల్లోనూ, రాష్ట్రాలలోని ఉద్యోగ, వ్యాపార రిత్య స్థిరపడ్డారు. తమను ఈ స్థాయిలో ఉండేలా విద్యా బోధనలు చేసిన గురువులను ఘనంగా సన్మానించాలని, అలాగే పూర్వ విద్యార్థుల అంతా కలుసుకోవాలని వారంతా అనుకున్నారు. ఈమేరకు విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులను, విశ్రాంత ఉపాధ్యయులు కలిసి వచ్చేనెల జనవరి 11వ తేదీన కలిసేందుకు నిర్ణయించు కున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయలకు ఆహ్వానం పలికారు. ఆహ్వానపత్రంతో పాటు ఒక మిఠాయి పొట్లంను అందచేశారు. మా ఆహ్వానంను స్వీకరించి దయ చేసి కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగు పూర్వ విద్యార్థుల అపూర్వ కలియకకు హాజరు కావాలని కోరారు.

మన్యంలో పర్యాటకుల సందడి

విశాలాంధ్ర-సీతంపేట : మన్యంలో ఆదివారం పర్యాటక ప్రదేశాలు పర్యాటకుల సందర్శనతో సందడిగా మారింది. స్థానిక ఎన్టీఆర్ అడ్వాంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం, సన్నపు గెడ్డ జలపాతం, ఆదలి వ్యూ పాయింట్, జగత్ పల్లి వ్యూ పాయింట్ వంటి పర్యాటక ప్రదేశాలలో దశకులతో సందడిగా మారి ఆటపాటలతో సందడి చేశారు.

జిల్లా స్థాయి ఇంగ్లీష్ పోటీల్లో కొమరాడ మొదటి స్థానం

విశాలాంధ్ర-కొమరాడ : ఇంగ్లీష్ భాషపై ప్రతి ఒక్క విద్యార్థి నైపుణ్యం పెంచుకోవాలనే ఉద్దేశంతో శనివారం జరిగిన బెలగాం చర్చి వీధిలోని పాఠశాలలో నిర్వహించిన పోటీ పరీక్షలలో పార్వతీపురం మన్యం జిల్లాలో 14 మండలాల నుంచి వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లీష్ భాష నైపుణ్య పాల్గొన్న టీములకు ప్రతి జట్టు ఆరు రౌండ్ల చొప్పున పోటీలు నిర్వహించారు. చివర రౌండ్ వరకు కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్ నుండి నలుగురు విద్యార్థులు తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్. జ్ఞానేశ్వరి, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి జోత్స, ఎనిమిదో తరగతి చదువుతున్న మరొక విద్యార్థి బి సిహెచ్ ఉదయ్ కుమార్, బి. జాన్ వెస్లే, ఏడవ తరగతి చదువుతున్న ఎ సెక్షన్ డి. నవ్య, తొమ్మిదవ తరగతి విద్యార్థి కె. జగన్ కొమరాడ, 9వ తరగతి చదువుతున్న కట్టోజు జాహ్నవి, 8వ తరగతి చదువుతున్న వటక సహస్రిత పోటీలో ప్రతిభ కనిపించారు. ఈ పోటీలో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో బలిజిపేట మండలం విద్యార్థులకు చోటు దక్కింది. జిల్లా స్థాయిలో కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్ మొదటి స్థానం విద్యార్థులకు డిఇఓ బ్రహ్మాజీ రావు, ఎంఈఓ. జె. నారాయణస్వామి ఎంఈఓ-2 జి తిరుపతిరావు కోటిపాం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

గంటేడకు సిఐటియు శ్రమ పురస్కారం

విశాలాంధ్ర-కురుపాం : స్నేహకళా సాహితి వ్యవస్థాపకుడు, ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడుకు సిఐటియు శ్రమ పురస్కారంతో విశాఖపట్నంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్ నరసింగరావు చేతులు మీదుగా ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర సమస్యలు, మన్యంలో అడవి బిడ్డలు బాధలపై చేసిన రచనలు, అందుకున్న వివిధ పురస్కారాలను కొనియాడారు. ఈసందర్భంగా కురుపాం స్నేహకళా సాహితి సభ్యులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా హిందూ సమ్మేళనం

విశాలాంధ్ర-కురుపాం : హిందూ సమ్మేళనంను కురుపాంలో ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సహాయక సంఘ్ ఏర్పాటై వందేళ్లు పూర్తైన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హిందూ ప్రచార పరిషత్ సభల్లో భాగంగా ఆదివారం కురుపాంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోటదుర్గా ఆలయం నుంచి ధూళికేశ్వర ఆలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం సమావేశంలో ఉమ్మడి జిల్లా విభాగ ప్రచారకర్త రాజశేఖర్ హిందూ ధర్మం, భారతీయ సంస్కృతి సంప్రదాయం, సనాతన ధర్మాన్ని, కుటుంబ విలువలు వివరించారు. గడప లోపల ఇతర కులం... గడపదాటితే అందరూ హిందువులం నినాదంతో ముందు కుసాగాలని పిలుపు ఇచ్చారు. ఈకార్యక్రమంలో బివికె ప్రిన్సిపాల్ టి.పాండురంగ, వర్తక సంఘం అధ్యక్షుడు బరాటం గుంపసోమేశ్వరరావు, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నిర్వహక కమిటీ సభ్యులు గుడ్ల నగేష్, చంద్ర శేఖర్, బలగ రామకృష్ణ, ఎన్ వంశీ, కర్రి ఉమ, ఎస్.గౌరీశంకర్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రమేష్‌చంద్ర పండా తదితరులు పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు చేసిన కోలాటం, విద్యార్థులు చేసిన సూర్య నమస్కారం అందరికీ ఆకట్టుకున్నాయి.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాదులు దూరం

విశాలాంధ్ర-బెలగాం : పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరకుండా ఉంటాయని జిల్లా ఎన్.సి.డి అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. సీతానగరం మండలం బూర్జ గ్రామంలో సర్పంచ్ గుజ్జల దాసు ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య నిర్వహణ ప్రక్రియ చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తా, చెదారం, వ్యర్థాలు, తుప్పలు యంత్రాలతో తొలగించడం జరిగింది. జెసిబి, ట్రాక్టర్ సాయంతో గ్రామంలో పలు ప్రదేశాల్లో పారిశుధ్యం నిర్వహించి వ్యర్థాలను డంపింగ్ వద్ద పారబోసారు. చెత్తా, చెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య రీత్యా డాక్టర్ టి. జగన్మోహన్ రావు పలు సూచనలు చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని వ్యక్తిగత శుభ్రతతో పాటుగా మనం నివసించే పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగకారక జనితాలకు ఆస్కారం ఉండదని, వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని పేర్కొన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తో క్యాన్సర్ ముప్పు వాటిల్లే అవకాశం ఎక్కువని కావున వాటి వినియోగం తగ్గించాలని, బహిరంగ ప్రదేశాల్లో పారవేయరాదన్నారు. వ్యాదుల వ్యాప్తికి కారణ భూతమైన బహిరంగ మల విసర్జన నిర్మూలించడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములై సమష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి ప్రవేశపెట్టి విస్తృతంగా అమలు చేస్తున్న ముస్తాబు కార్యక్రమం ఆరోగ్య రీత్యా ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యం ముడిపడి ఉందనీ ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ఆచరించాలని కోరారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -సాలూరు: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ అవిర్భావ దినోత్సవల వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాలూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ గేదెల రామకృష్ణ హాజరయ్యారు. ఈసందర్భంగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేకును కట్ చేశారు. అనంతరం కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 1885 డిసెంబరు 28న బొంబాయి నగరంలో కాంగ్రెస్ పార్టీ స్థాపించబడిందన్నారు. దేశ స్వాతంత్ర్యం సంగ్రామంలో కాంగ్రెస్ పార్టీ కీలక భూమిక వహించందన్నారు. దేశ స్వాతంత్ర్యం పోరాటం నుంచి నేటి వరకు ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. పార్టీ పునర్వైభవానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేవిధంగా కృషి చేయాల న్నారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ వాదులు అయిన పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య, ద్వారపురెడ్డి పుండరీకాక్ష నాయుడులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబిసీ ఛైర్మన్ వంగల దాలినాయుడు, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి రేసు రాము, మండల పార్టీ అధ్యక్షుడు ఒంటె బుచ్చయ్య, నాయకులు రావిపల్లి శ్రీను, గనివాడ గోవింద, శనపతి యుగంధర్, మైశర్ల పోలిరాజు, పాంచాలి తిరుపతిరావు, దొడ్ల నర్సింగరావు, ముడసర్ల సూరి, యడ్ల నాగరాజు, సాంబ తదితరులు హాజరయ్యారు.

గిరిజన సంస్కృతికి నిలువుటద్దం కందికొత్తలు పండుగ వేడుకలు

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం/ జియ్యమ్మవలస : ప్రకృతిని దైవంగా భావించి, తాము పండించిన మొదటి పంటను ప్రకృతికి అర్పించే గొప్ప సంప్రదాయానికి పార్వతీపురం మన్యం జిల్లా వేదిక అని కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో గిరిజన ఆచారాల ప్రతీకగా నిలిచే 'కందికొత్తలు' పండుగలో ఆదివారం కలెక్టర్ పాల్గొని భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలలో మమేకమైయారు. వేడుకలో గిరిజనులలో ఉత్సాహాన్ని నింపారు. సంప్రదాయం, ప్రకృతి, సంస్కృతి మేళవింపుగా సాగిన ఈ పూజల్లో కలెక్టర్ పాల్గొని, ఆదివాసీల ఆచార వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల జీవన విధానం ప్రకృతితో ఎంతగా ముడిపడి ఉందో ఆయన కొనియాడారు. అనంతరం, గిరిజన మహిళలు, పురుషులతో కలిసి కలెక్టర్ కాసేపు సంప్రదాయ నృత్యాల్లో పాలుపంచుకోవడం విశేషం. సంక్రాంతి పండుగకు ముందుగా వచ్చే ఈ వేడుకలో గిరిజనులు సమూహంగా చేరి సంప్రదాయ ఆచారాలను పాటించారు. తాము సాగు చేసిన పంట చేతికి వచ్చే తరుణంలో, భూమికి, ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం, ప్రకృతి, సంస్కృతి మరియు దైవం కలగలిసిన ఈ వేడుక గిరిజన జీవన విధానానికి అద్దం పడుతుందన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం ఐక్యతను, ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని చాటుతోందని గ్రామ పెద్దలు తెలిపారు. గిరిజన సంస్కృతిలో దాగి ఉన్న విలువలను నేటి తరానికి అందించడమే లక్ష్యంగా ఈ పండుగను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, గిరిజన సంప్రదాయ నృత్యాలు మరియు వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రకృతితో మమేకమై సాగే ఈ జీవన విధానం మన సంస్కృతికి ఒక అపూర్వమైన సంపద అని వేడుకను వీక్షించిన జిల్లా కలెక్టర్ కొనియాడారు. కలెక్టర్ తమ మధ్యకు వచ్చి సామాన్యుడిలా వేడుకల్లో భాగస్వామ్యం కావడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శేఖర్, ఎంపీడీవో లక్ష్మి, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.